

## 'డిటెక్టివ్' కథలకు ఆహ్వానం

నేరాలు, ఘోరాలు, ఆ ఘోరాల్ని వెతికి పట్టుకునే వాళ్లు.. కొంత సస్పెన్సూ... క్లూలు... మధ్యలో అల్లప్పుడప్పుడి లాంటి లవ్వూ... ఆ వెనక టకటకలు.. కటకటాలు... వెరసి 'డిటెక్టివ్'' కథ కదా!
ఇలాంటి డిటెక్టివ్ కథల్ని మీ 'జ్యోతి' ఆహ్వానిస్తోంది.
కథ ఆరు పేజీలకు దాటకుండా ఉంటే బాగుంటుంది.

మీ కథల్ని పంపాల్సిన చిరునామా.
ఎడిటర్ (డిటెక్టివ్ కథ)
జ్యోతి (ఇంటింటి మాసపత్రిక)
చిక్కడపల్లి, హైదరాబాద్—20

రాత్రి పదకొండుగంటలు కావచ్చింది. చిమ్మచీకటి. రైల్వేస్టేషన్ తప్పించి బాపట్ల ఊరు చాలామట్టుకు సగం నిద్రావస్థలో వుంది. ప్లాట్‌ఫారం మీద మెయిల్‌బండి కోసం ప్రయాణీకులు కాచుకొని ఉన్నారు. 43 అప్‌కి సైదుగంట కొట్టారు. పదకొండు గంటల పన్నెండు నిమిషాలకి సరిగ్గా మెయిల్‌బండి వచ్చింది. దానికోసం ప్లాట్‌ఫారంమీద కాచుకొని ఉన్నవాళ్ళలో ఇన్‌స్పెక్టర్ వేణు ఒకడు.

బండి అక్కడికి వచ్చినదే తడవుగా ఇన్‌స్పెక్టర్ వేణు ఖాళీ ఫస్టుక్లాస్




కోసంవెదికాడు. అతని బావమరిది సోమేశంకూడా ఒకపక్క నుంచి వెదుకుతున్నాడు. ఒకచిన్న కూపే పెట్టే ఖాళీగా ఉందని సోమేశం చూశాడు. వేణుని కేకవేసి పిలిచాడు. వేణు ఆ పెట్టెలో ఎక్కాడు.

'రెండు సీట్లూ ఖాళీగానే ఉన్నాయి. హాయిగా నిద్రపోవచ్చు' అన్నాడు వేణు.

'నిజమే గానీ, వెన్నపట్నం వెళ్ళేలోగా నువ్వే హత్యా కేసూ పరిశోధించడం మొదలెట్టకపోతే పడుకోవచ్చు' అని బావమరిది పరిహాసం ఆడాడు.

'సరే లే' అన్నాడు వేణు. బండి కదిలింది. పెట్టెలోనికి పోయి వేణు తలుపు మూశాడు. షాక్ తిన్నాడు. ఏదో వింతవాసన వేసింది. అపరాధపరిశోధనలో ఆరితేరిన అతడు 'ఇదేం వాసనా?' అని ఆలోచించ సాగాడు. రెండువక్కలా వేసిఉన్న కిటికీ తలుపులు పైకెత్తాడు. శరవేగంతో పోతున్న బండి గాలిని చీల్చుకొని పరుగెత్తుతూ ఉండడంవల్ల చల్లటి గాలి పెట్టెలోకివచ్చింది. అయినా ఆ వింతవాసన పోలేదు. అది క్లోరోఫారం వాసనని వేణుకి స్ఫురించింది. అతడు బాత్‌రూమ్ తలుపు తెరిచాడు. అందులోంచి ఒక ఆడశవం బయటపడింది.

ఆమె పాతికేళ్ళ జవ్వని. చాలా అందంగాఉంది. ఇంద్రధనస్సు రంగుల వాయిల్ చీర కట్టుకుంది.

వేణు బాత్‌రూమ్ లోనికి తొంగిమాశాడు. నీళ్ళ బేసిన్ మీద ఒకచిన్న తోలుపెట్టె ఉంది. దానిమీద రక్తపుమరకలు ఉన్నాయి. శవం వంటిమీద ఏమేమి గాయాలు ఉన్నాయో చూద్దామని వేణు కుతూహలపడ్డాడు కాని ఇది తాను పరిశోధించవలసిన కేసు కాదనీ, దీనిని దర్యాప్తు చేయవలసిన వాళ్ళు వేరే ఉన్నారని వేణు గుర్తుకు తెచ్చుకున్నాడు.

అతడు గొలుసు లాగాడు. స్టూవర్టుపురానికీ, చీరాలకీ మధ్య రైలు ఆగింది. గార్డు, రైల్వే పోలీసులు వేణు ఉన్న కూపిపెట్టెలోకి వచ్చారు. శవాన్ని చూశారు.

అదే రైలుబండిలో డియస్‌పి ప్రయాణం చేస్తున్నాడు. రైల్వే పోలీస్ జమాను డియస్‌పికి ఈ వార్త చెప్పాడు. అతడు హత్య జరిగిన పెట్టె దగ్గరకు వచ్చాడు. బండి కదిలింది. చీరాల స్టేషన్ చేరుకుంది.

ఇన్‌స్పెక్టర్ వేణు, డియస్‌పి ఇద్దరూ కూడా చెన్నపట్నంలో జరుగబోయే ఒక పోలీస్ ఉద్యోగుల అధికార సమావేశానికి వెడుతున్నారు. కానీ మెయిల్‌బండిలో ఘోరమైన హత్యజరగడంవల్ల దానిని దర్యాప్తు చెయ్యడం కోసం డియస్‌పి మటుకు చీరాలలో ఉండిపోయి. అదే మెయిల్ బండిలో వేణుని చెన్నపట్నం వెళ్ళమన్నాడు.

మెయిల్ బండిలో హత్య జరిగితే అది చాలా ప్రముఖమైన కేసుగా పత్రికలు ప్రకటించుతాయి. ప్రజలు దానిగురించే చెప్పుకుంటారు. అదే మెయిల్ బండిలో డియస్‌పి కూడా ప్రయాణం చేస్తున్నాడు అంటే, అతని కళ్ళముందుగానే హత్యజరిగిందని అందరు పరిగణిస్తారు. కాబట్టి ఈ కేసు తాను స్వయంగా దర్యాప్తు చేసి పరిష్కరిస్తే, ఆ ఘనతంతా తనకే వస్తుందని డియస్‌పి చీరాలలో ఉండిపోయాడు. హత్యజరిగిన పెట్టెను చీరాల స్టేషన్‌లోనే వేరుచేశారు. వేణు మరొక పెట్టెలోకి మారాడు. మెయిల్ బండి వెళ్ళిపోయింది. అందులో వేణు ప్రయాణం చేస్తున్నాడే కానీ, అతని మనస్సంతా వేరు చేసిన రైలుపెట్టెలోనే ఉండిపోయింది.

అతనికి నిద్రపట్టలేదు. బావమరిది సోమేశం ఆడిన పరాచికం నిజమయింది. మూడురోజులు పోయాక వేణు చెన్నపట్నం నుంచి తిరిగి వచ్చాడు. డియస్‌పి దివాకర్ రావుని కలుసుకున్నాడు. హత్యకేసుని చాలా మట్టుకు పరిష్కరించామన్న సంతోషం దివాకర్ రావు ముఖంలో వేణు చూశాడు.

'చూశావటోయ్ వేణు, నేనుచీరాలో ఉండి ఉండటంవల్ల ఎంత లాభమయిందో! నేనే స్వయంగా పరిశోధించాను కాబట్టి, కేసు మంచు విడిపోయినట్టు విడిపోతున్నది. ఎలా పరిష్కరించానో వింటావా?' అన్నాడు ఉత్సాహంగా.

'చెప్పండన్నట్టు' వేణు అతనివంక చూశాడు.

'హత్య చేయబడ్డ అమ్మాయి గుంటూరులో పెద్ద వ్యాపారస్థుడైన గురునాధరావుగారి కుమార్తె. పేరు సుగుణ. ఈమెను నగలకోసం ఎవరో హంతకుడు తెనాలికీ, నిడుబ్రోలుకీ మధ్య హత్యచేశాడు. తెనాలిలో ఆమె సజీవంగా ఉన్నట్టు పేపర్లమ్మే కుర్రాడు చెప్పాడు. తెనాలికీ, నిడుబ్రోలుకీ మధ్యఉన్న మోదుకూరు స్టేషన్ సమీపంలో హత్యచేయటానికి ఉపయోగించిన ఆయుధాన్ని హంతకుడు పారేశాడు. నిడుబ్రోలులో లూప్‌లైన్ వేపు దిగిపారిపోయి, హంతకుడు చీకటిలో కలిసిపోయాడు. అయినా వాడ్ని అవలీలగా పట్టుకోవచ్చుమలే,' అన్నాడు దివాకర్‌రావు.

'ఊహూ!' అని వేణు తల పంకించాడు.

'ఆవిడ తెనాలిలో రైలు ఎక్కిందా?' అని వేణు అడిగాడు.

'లేదోయ్. ఆమె తెనాలిలో దిగవలసింది. దిగలేదు,' అన్నాడు దివాకర్ రావు.

'ఆమె ఏ స్టేషన్ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నది?'

'రాజమండ్రి నుండి గుంటూరుకి. రాజమండ్రి అత్తవారిల్లు. గుంటూరు పుట్టిల్లు. ఆమె తెనాలిలో రైలు మారి, గుంటూరు వెళ్ళవలసి వుంది. అయితే ఆమె మనస్సు మార్చుకుంది. బెజవాడలో టిటిఐని పిలిచి, నెల్లూరు వరకు టిక్కెట్టు మార్చుకుంది.'

'నెల్లూరుకా? ఎందుకు ?' అన్నాడు వేణు.

'ఆ కారణం కూడా పరిశోధించాను. నెల్లూరులో రంగారెడ్డి అని ఒక వ్యక్తి ఉన్నాడు. అతడు సుగుణ ప్రియుడు. అతడు కూడా అదే బండికి ఏలూరు నుంచి బయల్దేరాడు. నవరుపేట స్టేషన్‌లో అతడు సుగుణను కలుసుకున్నాడు. తాను నెల్లూరు వెడుతున్నట్టు చెప్పాడు. అతనితో పాటు సుగుణ నెల్లూరు వెడదామనుకుంది. కానీ టిక్కెట్టు మార్పించడానికి నవరుపేటలో వీలుపడలేదు. అందువల్ల బెజవాడలో టిక్కెటు మార్పించింది,' అన్నాడు దివాకర్‌రావు.

'తెనాలిలో ఆమె సజీవంగానే ఉందని ఒక్క పేపరువాడే కాక పువ్వు లమ్మిన కుర్రాడు కూడా చూశాడు,' అని మరో వివరంకూడా చెప్పాడు దివాకర్‌రావు.

'పేపర్‌వాడు, పువ్వుల వాడు ఆమెని ఏ విధంగా గుర్తుపట్టారు? ఎలా జ్ఞాపకం పెట్టుకున్నారు?' అన్నాడు వేణు.

'పేపరువాడు ఖచ్చితంగా జ్ఞాపకం పెట్టుకోగలడు. ఎందుకంటే ఆమె ఒక వారపత్రిక కొంది. దాని త్రివర్ణ ముఖచిత్రంమీద ఉన్న సినిమా తార కూడా ఇంద్ర ధనస్సు రంగుల చీర కట్టుకుందిట. అది చూసి, 'సరిగ్గా నేను కట్టుకున్న చీరలాంటిదే ఈ బొమ్మదికూడా,' అందిట ఆమె. అందుచేత ఆమె చీరను పేపర్లవాడు బాగా జ్ఞాపకం పెట్టుకున్నాట్ట.'

'ఊహూ,' అని వేణు తలపంకించాడు.

'ఏం అన్నట్టు దివాకర్ రావు వేణువంక చూశాడు. వేణు ఈవిధంగా తలపంకించింతే ఏదో నిగూఢార్థం గానీ, మరత పేచీ గానీ ఉంటుందని దివాకర్‌రావుకి తెలుసు.

'అన్నీ బాగానే ఉన్నాయి. ఆమె రాజమండ్రి నుండి దూర ప్రయాణం చేస్తున్నది. అయితే రైలుపెట్టెలో ఒక చిన్న తోలుసూటు కేసు తప్ప ట్రంకు పెట్టెగానీ, హోల్డాలుగానీ కనపడలేదు. అవి ఏమయినట్టు?' అని అడిగాడు వేణు.

'ఈ సందేహం నాకూ వచ్చిందోయ్. దానికి సబబైన కారణమూ వుంది. అందుకు తగిన సాక్ష్యమూ ఉంది. రాజమండ్రి నుంచి సుగుణతో పాటు ఆమె దాసిది కూడా ప్రయాణం చేస్తోంది. గుంటూరు స్టేషన్ వరకే దాసీదాని టిక్కెట్టు ఉంది. దాన్ని కూడా నెల్లూరు వరకూ తనతో తీసుకువెళ్ళటం ఎందుకని, తెనాలిలో తన నగలపెట్టె తప్ప తక్కిన సామానుతో పాటు దాన్ని దిగి పొమ్మందిట. మర్నాడు ఎక్స్‌ప్రెస్‌లో తాను వచ్చేస్తానని, అంతవరకూ తెనాలి వెయిటింగ్ రూమ్‌లో ఉండమని దాసీతో చెప్పిందట. అది ఆ రాత్రల్లా వెయిటింగ్ రూమ్‌లో ఉన్నట్టు సాక్ష్యం కూడా ఉంది.' ఈ విధంగా సంజాయిషీ అంతా చెప్పి దివాకర్ రావు సంతృప్తి పడ్డాడు.

అంతలోనే ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్ రంగారెడ్డిని తీసుకొని దివాకర్‌రావు వద్దకు వచ్చాడు. అతణ్ణి డియస్‌పి ప్రశ్నించాడు. రంగారెడ్డి తాను

ఏలూరులో రైలు ఎక్కడం నిజమే గాని సుగుణను చూడలేదని, కలుసుకోలేదని నెల్లూరువరకూ ఆమె టిక్కెట్టు మార్పించిందనే సంగతి గాని తెలియదన్నాడు.

డియస్‌పి ఎన్ని రకాలుగా ప్రశ్నించినా రంగారెడ్డి ఇదే సమాధానం చెప్పాడు. ఇదంతా నిశ్శబ్దంగా వేణు విన్నాడు. కొంతసేపు పోయాక 'నేను వస్తానండి,' అని వేణు కదిలాడు.

పై అధికారి దర్యాప్తుచేస్తున్న కేసులో జోక్యం కలిగించుకొనటం మంచిది కాదు. అయినా వేణు ఉండబట్టలేక పోయాడు. అతడు తనమోటారు సైకిలు ఎగ్రగ్రాన్ని ఎక్కి వెళ్లాడు.

తెనాలి ప్లాట్‌ఫారం మీద పువ్వులూ, పేపర్లూ అమ్మేకుర్రాళ్ళని వేణు కల్సుకున్నాడు. ఇంక బండి కదలడానికి గంట కొడుతూ ఉండగా సుగుణ తన వద్ద పేపరు కొనిందని కుర్రాడు చెప్పాడు. బండి కదలబోతుండగా పువ్వులు కొనిందని రెండో కుర్రాడు చెప్పాడు. ఆ పెట్టెలోకి ఇంకెవ్వరూ ఎక్కడం తాముచూడలేదని పువ్వులమ్మే కుర్రాడు చెప్పాడు.

వేణు వెయిటింగ్ రూమ్ వాచ్‌మన్‌ని కలుసుకున్నాడు. దాసీది బండి వచ్చిన ఒక నిమిషానికి సామాన్లు తెచ్చి అక్కడ పెట్టిందని చెప్పాడు. అమ్మగార్ని పంపించి వస్తానని వెళ్ళిందని కూడా చెప్పాడు. మెయిల్ బండిలో హత్య జరిగిందని చీరాలస్టేషన్ నించి టెలిగ్రామ్ వచ్చాక, స్టేషన్ మాస్టర్ తన్ను పిలిచాడని, సుగుణ దాసీదాన్ని గురించి తాను స్టేషన్ మాస్టర్‌కు చెప్పాననీ అప్పుడే వెయిటింగ్‌రూమ్‌లో నిద్రపోతున్న ఆమెను లేపాననీ చెప్పాడు.

'ఊహూ,' అని తలపంకించి వేణు కదిలాడు.

వేణు గుంటూరు వెళ్ళి, సుగుణ తండ్రి గురునాధరావుని కలుసుకున్నాడు. కూతురు హత్యచెయ్యబడిందని అతడెంతో కుమిలి పోతున్నాడు. అయినా అతడు వేణుని చూడగానే ఉత్సాహంగా ప్రత్యుత్థానం చేశాడు.

'ఓహో, వేణుగారా. ఈ కేసు మీరు దర్యాప్తు చేస్తున్నారా?' అని గురునాధరావు అడిగాడు.

'లేదండి. నేను దర్యాప్తు చెయ్యటం లేదు. కాని, కుతూహలం పట్టలేక వచ్చాను. కొన్ని వివరాలు చెప్తారా?' అన్నాడు వేణు.

'అడగండి,' అన్నాడు గురునాధరావు.

'ఆ రోజు మెయిల్‌బండిలో మీ అమ్మాయి వస్తున్నదని మీకు తెలుసు కదా? తెనాలి స్టేషన్‌కు మీరు ఎందుకు వెళ్ళలేదు. కారైనా ఎందుకు పంపించలేదు?' అని వేణు అడిగాడు.

గురునాధరావు పెద్ద వ్యాపారస్థుడు. అమిత ధనవంతుడు. అతడికి రెండు కార్లు ఉన్నాయి. ఒక్కతే కుమార్తె. అత్తారింటి నుంచి వస్తున్నదని తెలిశాక రైలుకు కారు పంపించలేదంటే ఏదో కారణం ఉండాలని వేణు ఊహించాడు. అందుకే ఇలా ప్రశ్నించాడు.

'ఆ రోజు రైల్లో వస్తున్నదని నేను అనుకోలేదండి. ఆ మర్నాడు వస్తున్నట్టు జాబు రాసింది. కాని అనుకోకుండా ఆమె భర్త ఏదో కాంపు కెళ్లాల్సిన అవసరం వచ్చిందట అందుచేత మర్నాడు బయల్దేరవలసింది— ఒక్క రోజు ముందుగానే అమ్మాయి బయల్దేరిందట. మర్నాడు బయల్దేరితే నా బాగుండును. నా చిట్టితల్లి నాకు దక్కి ఉండును,' అన్నాడు గురునాధరావు కంటతడి పెట్టుకుంటూ.

'మీ అల్లుడికేం పని?' అని అడిగాడు వేణు.

'ఇంజినీరు.'

'కాంపు ఎక్కడికి వెళ్ళాడు?'

'ఏలూరుకి.'

'అయితే భార్యాభర్తలిద్దరూ ఒకే రైలులో ప్రయాణం చేశారా?'

'అవునండి. అతడు ఏలూరులో దిగిపోయాడు.'

'ఊహూ,' అని వేణు తల పంకించాడు. 'ఏలూరులో ఈయన దిగితే ఆయన...' అని వేణు ఆగిపోయాడు.

# ఒకసారి వీరిలా అన్నారు

ఆదికవులు భగవంతుణ్ణిగురించీ, అలనాటి కవులు రుషుల గురించి, ఆ తర్వాత వారు రాజ వంశాల గురించీ, మధ్య యుగాల్లో మహాపురుషులను గురించీ, నిన్న, మొన్నటి వారు సంపన్న కుటుంబాల గురించీ, నేడూ, రేపటి వారు మధ్య తరగతి మంచి వాళ్ళ గురించీ రాయడంలో ఉన్న వెసులుబాటు ఏ దివ్య శక్తులూ వీరత్వాలూ మైదుకొలిపే అందాలూ గొప్ప గొప్ప ఆదర్శాలూ, లోతైన సంస్కారాలూ లేని 'నేల బారు జనం' బతుకులు చిత్రించడంలో లభించదు.



వీళ్ళ బతుకుల్లో సహితం, సాహసం, ధార్మికతా, కరుణా, అక్కడక్కడ క్రౌర్యం, కపటం, కార్పణ్యం, వంచనా వంటి రస వస్తువులు లేవా? అంటే ఉన్నాయి. కానీ నిజాయితీతో చిత్రించబోతే అవి బొట్లుగానే తప్ప కప్పుల్లోనీ, కంచుచెంబుల నిండానూ లభించవు.

—కాళీపట్నం రామారావు

ఒక దేశపు అభ్యున్నతికి గాని, దాని వినాశానికి గాని, ఆదేశపు రచయితలు కారణమనే విషయం, కొన్ని మొండిరకాల రాజకీయవాదులు అంగీకరించక పోయినా— పరమసత్యం. జర్మనీ వినాశానికి కారణభూతుడైన 'హిట్లర్' అనే తుంటరి ఆ దేశంలో పుట్టుకరావటానికి, 'నాజీజం' అనే వెకిలిరకం సైనికత్వం ఒకటి విషవృక్షంలా ఆ గడ్డమీద పెరగటానికి, జర్మన్ చరిత్రకారుల వికృత రచనలు, ముఖ్యంగా మంగోల్ చరిత్రకు సంబంధించిన అంధ రచనలు ఏకైక కారణమంటే ఇందుకు పాఠకులు నన్ను మన్నించగలరని ఆశించుతున్నాను.




జర్మనీ చరిత్రకారులు, మంగోల్ సైనిక శాసనాలను, సైనిక నిర్మాణ వివరాలను అర్థం చేసుకున్నంతగా వాటి అవతరణకు మూలశక్తి అయిన 'మానవుణ్ణి' అవగతం చేసుకోలేక పోయారు.

—తెన్నేటి సూరి

‘వేణుగారు పుణ్యముంటుంది. నా కూతురు హత్య చెయ్యబడి అర్ధాన్నపు చావువచ్చింది అన్న బెంగలేదు కానీ ఇంకో అప్రతిష్ఠ రాకుండా మటుకు చూడండి. రంగారెడ్డితో నాకూతురు స్నేహంగా ఉండేదన్న సంగతి నేనూ ఒప్పుకుంటాను. కానీ, పెళ్ళయిన దగ్గర్నుంచీ అతణ్ని కలుసుకోలేదు. ఉత్తరాలు రాయలేదు. పూర్తిగా అతణ్ణి మరిచిపోయింది. రంగారెడ్డితో సంబంధం ఉన్నందుకు ఆమె నెల్లూరు వెళుతున్నదని గానీ, అందువల్ల హత్యచేయబడిందని గానీ బయటకి రాకుండా చూడలేరా?’ అని గురునాథరావు దీనంగా అడిగాడు.

వేణు జవాబు చెప్పలేదు.

‘మీ దాసీది ఎక్కడుంది?’ అని ఒక్కక్షణం పోయాక వేణు అడిగాడు.

గురునాథరావు దాసీని పిలిపించాడు. ఈ దాసీయే సుగుణతో పాటు రాజమండ్రి నుంచి ప్రయాణం చేసింది. డియస్‌పి దివాకర్ రావుతో ఏ వివరాలు చెప్పిందో అవే వేణుకి చెప్పింది. అయితే దివాకర్ రావు అడగని ప్రశ్నల్ని వేణువేశాడు. మరికొన్ని విషయాలను తెలుసుకున్నాడు.

‘నువ్వెన్నాళ్ళయింది ఈ పనిలో చేరి?’

‘నాలుగునెలలు.’

‘సుగుణమ్మగారి భర్త ఏలూరులో దిగిపోవడం నువ్వు చూశావా?’

‘చూశానండి. నేను మూడోక్లాస్ పెట్టెనుండి వరుపుల పెట్టె వద్దకు వెళ్ళి, బాబుగారి సామాన్లు కూడా దింపానండి.’

‘తెనాలి స్టేషన్లో మీ అమ్మగారి దగ్గర బండి కదిలేదాకా ఉన్నావా?’

‘లేదండి అంతసేపు ఉండలేదండి. సామాన్లన్నీ దింపించి, ముందే వెయిటింగ్ రూములో పెట్టించానండి. ఐతే బండి కదులుతున్నప్పుడు అమ్మగార్ని వెళ్ళి చూశానండి.’

‘ఆవిడతో పాటు పెట్టెలో మరెవరైనా ఉన్నారా?’ అని వేణు అడిగాడు.

‘ఎవరో మగాయన కూర్చున్నాడండి. ఇంక బండి కదలబోతుందనగా ఎక్కాడు.’

‘ఆ మనిషెవరో నీకు తెలుసా?’

తెలియదండి. ఆకుపచ్చ కోటుమట్టుకు వేసుకున్నాడు.’

‘ఊహూ,’ అని వేణు తలపంకించాడు. ఇందాక డియస్‌పి దివాకర్ రావుతో మాట్లాడటానికి వచ్చిన రంగారెడ్డి ఆకుపచ్చ కోటువేసుకున్నాడు.

‘మీ అమ్మగారు తెనాలిలో దిగడం లేదని నీకు ఎప్పుడు తెలుసు?’ అని వేణు అడిగాడు.

‘బెజవాడలోనే తెలుసండి. అక్కడే ఆమె టిక్కెట్టు మార్పించుకున్నారండి. ప్రక్కస్టేషన్లో దిగబోతారు గదా, చీర మార్చుకుంటారా అని అడగటానికి వెళ్ళానండి. ప్రక్కస్టేషన్లో దిగడం లేదుగాని, చీర మార్చుకుంటానన్నారండి. పెట్లోంచి నన్నే చీర తియ్యమన్నారు. ఏ చీర అని అడిగానండి. ఇంద్రధనస్సు రంగుల చీర అని చెప్పారండి.’

వేణు సరేనని ఆమెను పంపించాడు. గురునాథరావువద్ద సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

* * *

డియస్‌పి దివాకర్‌రావు చాలా చికాకుగా ఉన్నాడు. సుగుణ నగలలో ఒకటి జగ్గప్పలనే దొంగ దగ్గర దొరికింది. వాణ్ణి పోలీసులు పట్టుకొని, దివాకర్‌రావు దగ్గరకి తీసుకొచ్చారు. ఈ జగ్గప్పే నగలకోసం హత్య చేసినట్టు రుజువు చేయవచ్చునని డియస్‌పి ముందు ఊహించాడు గానీ కొద్దిసేపు పోయాక అది అసాధ్యమని తేలింది.

టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్నాడని జగ్గప్పని రైల్వే పోలీసులు బెజవాడలో హత్య జరిగిన నాటి రాత్రే పట్టుకొన్నారట. ఆ తెల్లవార్లూ వాడు బెజవాడ రైల్వే పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నాడు.

హత్య తెనాలికీ, నిడుబ్రోలుకీ మధ్య జరిగింది. హత్య చేయడానికి ఉపయోగించిన ఆయుధం ఆ రెండు స్టేషన్ల మధ్యే దొరికింది. అదీగాక తెనాలిలో సుగుణ సజీవంగా ఉందని తేలింది. బెజవాడ రైల్వే పోలీస్ స్టేషనులో ఉన్న జగ్గప్ప హత్య చేయడానికి వీల్లేదు. అందుచేత దొంగతనం కోసం హత్య జరిగిందన్న సిద్ధాంతానికి ఆస్కారం లేదు.

ఈ కారణాల వల్ల దివాకర్ రావు చాలా చిరాకుగా వున్నాడు. వేణువచ్చి అతడిని కలుసుకున్నాడు. అన్ని విషయాలూ దివాకర్ రావు వేణుకి చెప్పాడు.

‘ఊహూ,’ అని వేణు తల పంకించి, ‘హత్యకి ప్రోద్బలం మరొకటి కావచ్చు. ప్రేమచేత జనించిన ఈర్ష్య కారణం అవడానికి వీలుంది. తెనాలి స్టేషన్‌లో ఇంక బండి కదలబోతూ ఉండగా, ఆకుపచ్చ కోటు తొడుక్కొన్న వ్యక్తి సుగుణ పెట్టె ఎక్కాడని దాసీది చెప్పింది. రంగారెడ్డి ... అని వేణు చెప్తూ ఉండగా దివాకర్‌రావు ముఖం వికసించింది. కాని అంతలోనే ముడుచుకుపోయింది.

‘ఏలూరులో రైలెక్కిన రంగారెడ్డి నెల్లూరు వచ్చేదాకా కంపార్టుమెంట్ దిగలేదు. అందుకు అతడితోపాటు ప్రయాణంచేసిన పెద్ద మనుష్యుల సాక్ష్యం ఉంది,’ అన్నాడు దివాకర్ రావు.

నేను రంగారెడ్డి చేశాడని అనటం లేదు. రంగారెడ్డి ఆకుపచ్చ కోటు వేసుకున్నాడు. కాబట్టి హత్యానేరం అతనిమీదకి తొయ్యడానికి ఎవరైనా అలాంటి కోటు వేసుకొని ఎక్కారేమో?’

‘ఎవరెక్కుతారు?’

‘సుగుణ భర్తకావచ్చు.’

‘ఆయన ఏలూరులో రైలు దిగిపోయాడుగా!’

‘అవును. అదే బండిలో తన భార్య ప్రియుడు ఎక్కడం అతడు చూశాడు కాబట్టి, తాను రైలు దిగిపోయినట్టు నటించి, ఇంకో పెట్టెలో ఎక్కకూడదా? ప్రయాణం కొనసాగించ కూడదా? బెజవాడలో సుగుణ నెల్లూరుదాకా టిక్కెట్టు మార్పించడం చూడకూడదా? తెనాలిలో బండి కదులుతున్నప్పుడు సుగుణ పెట్టెలోకి ఎక్కకూడదా? తెనాలి దాటాక హత్య చేసి, నిడుబ్రోలులో దిగి పోకూడదా?’ అన్నాడు వేణు.

‘నువ్వు చెప్పిన వేటికీ ఆస్కారం లేదు. సుగుణ భర్త ఆ రాత్రంతా ఏలూరు ట్రావెలెర్సు బంగాళాలోనే ఉన్నాడు. అతని పక్కగదిలో పి.డబ్ల్యుడి. చీఫ్ ఇంజనీరు కూడా ఉన్నాడు. ఆయనా, ఈయనా రాత్రి పన్నెండు దాకా బాతాఖానీ కొట్టారట,’ అన్నాడు దివాకర్‌రావు.

‘అయితే ఇకనేం, ఈ హత్య కేసుని సులభంగా పరిష్కరించ వచ్చు. పదండి.’ అన్నాడు వేణు.

‘ఎక్కడికి?’ అన్నాడు దివాకర్ రావు.

‘జగ్గప్ప పాతదొంగ. వాడు దొంగతనం చేసేపద్ధతి నాకు తెలుసు. వాడెప్పుడూ ఒంటరిగా దొంగతనం చెయ్యడు. పదేళ్ళ కిందట నేను రైల్వే పోలీసుగాపని చేసినప్పుడు వీణ్ణి నేనుపట్టుకున్నాను. ఈ కేసులో కూడా వాడు మరొకరి సహాయం పొంది ఉంటాడు,’ అని వేణు చెప్తూ ఉంటే దివాకర్‌రావు అడ్డొచ్చాడు.

‘అదీ శోధించానోయ్. జగ్గప్ప, మల్లప్ప ఇద్దరూ కలిసి దొంగతనం చేస్తూ ఉంటారు. ఆ రాత్రి మల్లప్ప తెనాలిలో ఉన్నాడు. చెక్ చేశాను. మెయిల్‌బండిలో వాడు ప్రయాణంచేయలేదు. నీ సిద్ధాంతం లాభం లేదు,’ అన్నాడు దివాకర్‌రావు.

‘అయినా పదండి.’ అన్నాడు వేణు.

ఇద్దరూ కదిలారు. వేణు ఎర్రగుర్రం ఎక్కాడు. డియస్‌పి ఇంకొక మోటారు సైకిల్ తొట్టెలో కూర్చున్నాడు. ఒక హెడ్డు ఆ సైకిల్ తోలుతున్నాడు.